# నా తెలంగాణా

విశాలంగా పరుచుకొనున్న వేపచెట్టు. ఆ చెట్టు నానుకొనో టేలా... ఆ టేలా తుప్పుపట్టింది. రేకులూడిపోతున్నాయి. దాన్నిండా పాత బూట్లు. పాతచెప్పులు పాత బ్యాగులుగుట్టలుగా పడున్నాయి. అందులోనే కుట్టుమిషనుంది. గ్రైండరుంది. ఆ టేలా ఓ మినీ కర్మాగారంలా ఉంది. ఆ టేలా ముందు గోనెసంచీ ఉంది. దానిపై కూర్చొనున్నాడు పోచయ్య. అతని ముందో నల్ల సరం బండుంది. అతని ఇరుపక్కల చెప్పుల రిపేరు కవసరమయ్యే రంపం, గూటం. స్క్రూడ్రైవర్, అంబూర్, మొలల డబ్బా, దారం ఉండా, సొల్యూషన్ డబ్బా, తోలు ముక్కలు, స్పాంజిలాంటి అనేక వస్తువులన్నాయి.

పోచయ్య చేతిలో ఆరె ఉంది. పక్కనతోలునుకోసే కత్తుంది. పాతచెప్పును దారంతో కుడుతున్నాడు పోచయ్య, గూటంతో గుద్దుతున్నాడు.

పోచయ్య ముఖంలో యాభై ఏళ్ళ వయసు. తలవెంట్రుకలు చాలా వరకు తెల్లబడున్నాయి. మీసాలూ సగానికిపైగా తెలుపు రంగులో కొచ్చాయి. అతని వదనంలో ఎన్నెన్నో ఒడుదొడుకులను చూసిన అనుభవాల ముడతలున్నాయి. ఆత్మవిశ్వాస ముంది. ఏకష్టాలూ, చేదు అనుభవాలూ తననేం చేయలేవన్న ధీమా ఉంది. అవసరమైతేకొండనైనా పిండి గొట్టగలవన్న ధైర్యముం.

చెట్టు వేరుకు కట్టి వేయబడున్న కోతి అటూ ఇటూ తిరుగుతుంది. సూర్యుడు నడినెత్తిమీద కొచ్చాడు. నిల్చొని తన ప్రతాపం చూపిస్తున్నాడు. చెట్టు కొమ్మకూడా ఊగడం లేదు.

''నీయవ్వ కొమ్మనూగుత లేదు'' గిప్పుడే ఎండలు గిట్లుంటే ఇగ రోహిండ్లెట్లుండాలె...? రోల్లు పలుగుడేమో కాని మనుషులు సచ్చెటట్టున్నరు.'' గొణుక్కున్నట్టను కుంటూనే పైకి అనేవాడు పోచయ్య.

టేలా పక్క నున్న గద్దె మీద కూర్చున్న వీరేశం ''కలియుగం నాశనమా యెటట్టుంది. పాపం పెరిగిపోతంది... ఎవ్వలన్న మందలియ్య వాటమున్నదా....? అందుకే అన్ని విపరీతాలు...'' అన్నాడు.

''బ్రహ్మంగారు చెప్పింది నిజమైతంది. ఎంపలిచెట్లకు నిచ్చెన్లే సెటోల్లు పుడుతండ్రు. రెండువేల సంవత్సరం వరకు ప్రపంచం మునుగుతదుట....'' అన్నాడక్కడే నిల్చొనున్న వీరాచారి. ''మునిగితే మునుగ నియ్యి పటు... మనుషుల్లో స్వార్థం బాగా పెరిగింది.'' అని లేచినిల్చున్నాడు వీరేశం. వీరాచారి, వీరేశం అక్కన్నుంచి వెళ్ళిపోయారు.

బీడీ వెలిగించి నాలుగు దమ్ములు లాగిపారేశాడు పోచయ్య. ఊడిపోతున్న చెప్పుల మధ్య

సొల్యూషన్ రాసి కొంచెమాగి గూటంతో గుద్దుతున్నాడు పోచయ్య.

ఒకప్పుడు తనలాంటి వాళ్ళ నీడ కూడా మీద పడనిచ్చేవారుకాదు. దూరంగా ఉండేవారు. ఇక్కడికొచ్చిన కొత్తలో తన దగ్గర తనకులం వాళ్ళు తప్ప ఎవరూ కూర్చునే వారు కారు. ఇప్పుడలా లేదు. తన దుకాణం దగ్గరే కూర్చొని అన్ని కులాల వారూ మాట్లాడుకుంటున్నారు. తనలో తాననుకుంటున్నాడు పోచయ్య. అతనికీ పరిస్థితి ఆనందంగానేంది.

తన పని తాను చేసుకుపోతున్నాడు పోచయ్య.

సఫారీ డ్రెస్ ధరించున్న ఓ వ్యక్తి వచ్చి పోచయ్య ముందు నిల్చున్నాడు. కాళ్ళకున్న చెప్పులు విడిచి నిర్లక్ష్యంగా పోచయ్య ముందుకు జరిపాడు. తలపైకెత్తి అతన్నోసారి చూసి తనపనిలో నిమగ్నమయ్యాడు పోచయ్య.

''చెప్పులు విడిచింది కనబడటం లేదా...? అన్నాడు పొగరుగా సమ్మిరెడ్డి.

''మీకేం గావన్నో సెప్పంది నాకెట్ల తెలుస్తది...'' అన్నాడు సమ్మిరెడ్డి చెప్పులను చేతుల్లోకి తీసుకుంటూ పోచయ్య.

''ఉంగటాలు తెగిపోయినయి... కుట్టియ్యి.''

''దారంతో కుట్టన్నా...? మొలలు గొడితేసరిపోతదా...?''

''ఎలా మంచిగుంటె అలా చెయ్యి. ఎప్పటికీ మీ దగ్గరకు రావన్నని మాత్రం చూడకు. అయినా మీ బుద్ధులేడికి పోతయి...?''

సమ్మిరెడ్డి మాటలు విన్నపోచయ్యకు చివుక్కుమంది. తలెత్తి ఆతన్నోసారి తీక్షణంగా చూసాడు. ఏమనుకున్నాడో ఏమో మౌనంగా ఎడమకాలి చెప్పును చేతిలోకి తీసుకున్నాడు. తెగిపోయిన ఉంగటాన్ని కత్తితో కోసాడు. లోపలికున్న తోలును తీసిపారేశాడు. అలాగే రెండవ చెప్పుకూ చేసాడు.

అల్లరి చేస్తున్న కోతిని విడిచాడు. అది చిలిపి పనులుచేస్తూ ఆడుకుంటుంది. అటూ ఇటూ ఎగురుతుంది. పోచయ్య దగ్గరికొస్తుంది. పొమ్మనగానే దూరం పోతుంది. చెట్టు కొసకొమ్మలకెక్కుతూ మండలమీదికి దూకుతుంది. కిచ్‌కిచ్ మని అరుస్తూ అక్కడున్న వాళ్ళకు వినోదాన్నిస్తుంది.

ఉంగటాలు కుట్టడం పూర్తిచేసి చెప్పులు సమ్మిరెడ్డి కాళ్ళముందు పడేసాడు పోచయ్య. వాట్ని తొడుక్కొని చూసాడు. చేతుల్లోకి తీసుకుని ఉంగటాలని లాగి చూసాడు సమ్మిరెడ్డి. ఆ పనికి సంతృప్తి చెందాడు.

''ఎంతియ్యాలె...? అనడిగాడు.

''రొండు రూపాయలు..''చెప్పాడు పోచయ్య.

సమ్మిరెడ్డి భృకుటి ముడిపడిందా మాటలతో.

''రెండ్రూపాయలకేమస్తన్నయి సారిప్పుడు...? ఇక్కన్నైతే ఏ కూరగాయలూ పావుకిలో కూడ రావు.'' అంటే ఒక్కరి చెప్పులు కుట్టితే వచ్చే డబ్బు ఒక్కరోజు కూరగాయలకు సరిపోవాలా?''

''అంటే బతికేదిగూడ ఒక్కన్నేగాదుకదసార్..! నాకు కుటుంబముంది.'' ఈ చిన్నపనికి రెండు రూపాయలా..? ఇలా చూస్తే మీ పనే నయముంది. ఎనిమిది గంటలు, అంతకు పైన్నే ఫ్యాక్టరీలో పనిచేస్తే మాకేమొస్తుంది?''

''ఫ్యాకరీల నౌకరేయున్నంటె చదువుగిట్ల కావాలెకని నాపని చేస్తనంటె కాదువాళ్ళివ్వలు సార్...?

ఈ మాటలన్నెందుగ్గని నారెండ్రూపాయలియ్యండ్రి.'' రూపాయితీసి కింద పడేసాడు సమ్మిరెడ్డి.

''నువ్వేమనుకుంటున్నావో? ఏది పడితే అది మాట్లాడుతున్నావు. నేనెవర్నో తెలుసా? పెద్ద ఇంజనీయర్‌ని...''

''నేనేమెక్కో మాట్లాడతలేను సార్? మీరడిగినవాటికి జవాబులు చెప్పుతున్న.. మీరు పెద్ద ఇంజనీరే మరి గీ ఒక్క రూపాయికి గింత గొడవెందుకు చేస్తున్నరు సార్. ఇంకో రూపాయిచ్చేయిండ్రి.'' అన్నాడు పోచయ్య. '' ఒక్క రూపాయికి మోతాదని కాదు. ఎందుకియ్యాలన్నదే నా వాదన. నేం దలుచుకుంటె ఇక్కణ్ణుంచి నీటేలా పీకేయించగలను తెలుసా?''

''తలుచుకుంటె తలుచుకోండ్రి కని నా రూపాయిచ్చి పోండ్రి. రెండుంగుటాలు మొలలు కొడితె రూపాయి. కుడితే రెండ్రూపాయలు తీసుకుంటన్న... మీ ఒక్కరి దగ్గరెక్కువేం తీసుకుంటలేను.''

వాళ్ళిదరి మధ్య జరుగుతున్న గొడవ విని అటునుంచి పోతున్న వాళ్ళంతా వచ్చి అక్కడ నిల్చున్నారు.

తాను చేసిన పనికది ఎక్కువేకాదని పోచయ్య వాదన. ప్రభుత్వరంగ సంస్థలో ఇంజనీయరైన తనలాంటివాణ్ణి ఓ చెప్పులుకుట్టేవాడు నిలదీసి అడగడం అవమానంగా భావిస్తున్నాడు సమ్మిరెడ్డి.

'' ఉంగటానికి పదిపైసలు పారెత్తె నోరుమూసుకునెటోల్లు.. ఇదేమన్న రేటేనా..?'' కోపంగా అన్నాడు సమ్మిరెడ్డి.

అవున్సార్. అప్పుడు పదిపైసలే. నేనిరువయేండ్ల కిందిక్కడికొచ్చిన. అప్పుడు కిలో మాంసం ధర ఎనిమిదో, పదో ఉండే.. ఇప్పుడు నూర్రూపాయలు... మీజీతమప్పుడు వెయ్యుంటె ఎక్కువే... ఇప్పుడు ఏడెనిమిదివేలన్నా ఉందనుకుంట.. కాదంటరసార్..''

''నా జీతాన్ని లెక్కబెట్టేవాడివైనావా? నీ బతుకెంత...?''

'' ఏదో అట్లమాటవరుసకన్నసార్..'

వాళ్ళమధ్య రూపాయి వివాదం ముదిరిముదిరి గాలివానయ్యేట్టున్నా అక్కడున్నవాళ్ళు వినోదం చూస్తున్నట్టు నిల్చున్నారు.

''మీరు బాగ మిడిసిపడుతుండ్రు.. సర్కారల్లుండ్లమని మురుస్తుండ్రు.. మీది పెద్దకులమైతే అసలే ఆగకపోయే వాళ్ళు.

ఆ మాటలతో పోచయ్య ముఖం గంభీరంగా మారింది.

''సార్...! దయచేసి కులాల మాటెత్తకుండ్రి. నేనీకులంలో పుట్టినందు కేం చిన్నబుచ్చుకుంటలేను. పైగా గర్వపడుతున్న. మారెక్కల కష్టంతోని మేం బతుకుతం. అన్ని పనులు చేస్తం. అన్నిపంటలకు సృష్టికర్తలం మేం. అయినా ఏకులం గొప్పైనా ఏంది సార్..? ఎవ్వల కులం వాళ్ళకే గొప్ప..'' ఆవేశంగా అన్నాడు పోచయ్య.

' ఇంతకు ముందు మాలమాదిగ కులాలవాళ్ళలో చదువుకున్నవాళ్ళు తమ కులం చెప్పుకోవడం కొంత చిన్నతనంగా భావించేవారు, కానిప్పుడు..? తనలో తానుకున్నాడు సమ్మిరెడ్డి.

''అంబేద్కర్ సంఘాలని ఏవేవో సంఘాలని పెట్టి అంతా మీదే రాజ్యమనుకుంటున్నారు. నేను రూపాయివ్వ.. ఏంజేసుకుంటవో చేసుకో..'' అని పోబోయాడు సమ్మిరెడ్డి.

పోచయ్య లేచి నిల్చున్నాడు.

''ఆగుండ్రిసార్..మర్యాదగా రూపాయిచ్చి మీ జాడల మీరు పోండ్రి.''

పోచయ్యనగానే అలాగే నిల్చున్నాడు సమ్మిరెడ్డి.

ఇంతలో ప్రతాపరెడ్డి ముందు కొచ్చాడు. చాలా సేపట్నుంచా తడక్కన్నే ఉన్నాడు. ''సమ్మన్నా! నువ్వో పెద్ద ఇంజనీరువి. ఇంజనీరంటే మాటలానె. నీలాంటి వాడు ఒక్క రూపాయికోసం ఇంతసేపు వాదించుడేంబాగుంది చెప్పు? ఎవ్వలన్న విన్నా మానంబోతది. రూపాయే కదా. నువ్వియ్యకుంటె నేనిస్తపటు.'' అని పాంటుజేబులో చెయ్యిపెట్టాడు ప్రతాపరెడ్డి.

ప్రతాపరెడ్డి తనను తిడుతున్నాడో, పొగడుతున్నాడో సమ్మిరెడ్డికర్థం కాలేదు. ''నువ్విచ్చుడెందుకు? నాదగ్గర రూపాయి లేకనా? ఈ రుబాబెందుకు? చెప్పులు కుట్టెటోనికి కూడా గంత ఇదెందుకు?'' జేబులోంచి రూపాయి తీసి పోచయ్యకిచ్చాడు సమ్మిరెడ్డి.

''సమ్మన్నా! నీకు ఊళ్ళో ఉన్నప్పటి దొరతనం మాటలు పోలేదు. మారుతున్న కాలంతోపాటు మనమూ మారాలి. వెనుకటి మా తాతలు నేతులు తాగిండ్రంటే లాభం లేదు. నువ్వు ఊళ్ళోలాగా మాటలంటే ఎవరూ పడరు. ఏ వృత్తినీ కించపరుచవద్దు. నువ్వు ఆకలిరాజ్యం సినిమా చూల్లేదా..? కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా దేన్నీ హీనంగా చూడకుమన్నాడు శ్రీశ్రీ...''

ప్రతాపరెడ్డికూడా పోచయ్యనే సమర్థిస్తూ మాట్లాడేసరికి దిక్కుతోచలేదు సమ్మిరెడ్డికి.

కొన్నేళ్ళ క్రితమయితే తనలాంటి హరిజన కుటుంబానికి చెందినవాడు రెడ్డి కులానికి చెందినతనితో ఎదురుగా మాట్లాడే పరిస్థితే లేదు గ్రామాల్లో. ప్రతాపరెడ్డి తనకు మద్దతుగా మాట్లాడేసరికి పోచయ్య కెంతో సంతోషం కల్గింది. ''సార్..!మాకు మిడిసిపాటు వద్దు నిజమే. మరి మీకెందుకింత మిడిసిపాటు...?నాకు తెలియకడుగుత? మీకున్నగొప్పేంది?' అన్నాడు పోచయ్య.

''నీతీజాతీ లేని కులం. నా మీదకే ఇష్టమున్నట్టు మాట్లాడుతావా? మీ ఆడవాళ్ళన్ని పెండ్లిళ్లై ఏనా చేసుకుంటారు.'

సమ్మిరెడ్డి మాటలతో పోచయ్య ముఖం ఎర్రబడింది.

పోచయ్య కూతురుకు విడాకులైతే మళ్ళీ పెళ్ళి చేసాడు. ఆ విషయాన్నే దృష్టిలో పెట్టుకుని సమ్మయ్యా మాటలన్నాడన్న విషయం అర్థమైంది పోచయ్యకు. పెల్లుబికి వస్తున్న కోపాన్ని దిగమింగుకున్నాడు.

''అవునుసార్. మా ఆడోళ్ళు మీ ఆడోల్లలా పంజరంలోని చిలుకలు గాదు. మీరు ఆడోల్లను కొట్టినా, తిట్టినా, తాగొచ్చి తన్నినా పడుండటానికి మొగవాళ్ళ మీదనే ఆధారపడి బతికెటోల్లుగాదు. వ్యక్తిత్వం లేనోల్లుగారు. మా కుంటుంబాల్లో మీవోలె ఆడోల్ల కోటి, మొగోల్లకోటి ఉండదు. వాళ్ళు మాతో సమానంగా పనిజేస్తరు. మే కష్టం సుఖం సమానంగనే పంచుకుంటం. మేం కలిసే తింటం. కలిసే తాగుతం. ఆడదైన, మొగాడైన ఇష్టం లేకుంటె విడిచిపెట్టం. ఇద్దరూ వేరేవాళ్ళను చేసుకుంటారు. లేదా తన కాళ్ళమీద నిలబడ్తరు. ఇందులో తప్పేముందో నాకు తెలుస్తలేదు.''

ఓ చెప్పులు కుట్టుకునే వ్యక్తి తనతో అంత తార్కికంగా మాట్లాడటం తనను సమర్థించుకోవడం, అంతమంది ముందర తననోరు మూయించడానికి ప్రయత్నించడం సమ్మిరెడ్డికి మింగుడు పడటంలేదు. అతని మాటల్లో ఎంతో లోతున్నట్లనిపిస్తున్నా ప్రభుత్వ సంస్థలో ఇంజనీరయిన తాను చెప్పులు కుట్టే

వానికి లొంగిపోవడం సమ్మిరెడ్డికి కొసలే ఇష్టంలేదు.

''అలగాజనం..అలగాబుద్ధులు..పుట్టుకతో వచ్చిన ఆ మాదిగ బుద్ధులేడికిపోతాయి...? ఎలుకతోలునను పట్టుకొని ఎన్నేళ్ళుకడిగానా ఆనలుపేడికి పోతుంది? పైగా అన్నిట్నీసమర్థించుకోవడం...? కోపంగా అని అక్కణ్ణుంచి వెళ్ళిపోబోయాడు సమ్మిరెడ్డి.

'' ఆగుండ్రిసార్..'' పోచయ్య మాటలతో అలాగే ఆగాడు సమ్మిరెడ్డి. ''ప్రతాపరెడ్డి సార్...! లక్ష్మయ్య సార్. మీరంత గవాయున్నరు..మీ ముందట్నే ఈ సారు నన్ను కులం పేరుతోని తిట్టిండు.. ఒక్కసారిగాదు.. ఇది మూడో సారి. మీరు విన్నదే సాక్ష్యమియ్యండ్రి. మహబూబ్‌నగర్‌లో నేను కేసు పెడుతా... ఇగపోండ్రిసార్'' అన్నాడు పోచయ్య.

ఈగొడవతో కోతి చేస్తున్న గొడవనెవరూ పట్టించుకోవడం లేదు. సమ్మిరెడ్డిని 'నిమ్మజాతుల పరిరక్షణ చట్టం' కింద తింపాల్సిందేనని అక్కడున్న కొందరంటున్నారు. చిన్న విషయానికింత పెద్దగా చేయడమెందుకులే అని కొందరంటున్నారు.

సమ్మిరెడ్డిని కేసులో ఇరికించాల్సిందేనని చాలా మందంటున్నారు. పరిస్థితిని గమనించాడు ప్రతాపరెడ్డి.

''సమ్మన్నా! నీ నోటి దురుసుతనం పోగొట్టుకోవు.. కులం పేరుతో తిడితే నిమ్నజాతుల పరిరక్షణ చట్టం కింద నిన్నరెస్టుచేయొచ్చు. చిన్న కంప్లయింటిస్తే సరిపోతుంది. దీనికి కోర్టు ఒక్క మహబూబ్‌నగర్‌లోనే ఉంది. తిరుపతిరెడ్డి కొడుకు విషయంలో తిరగడం చూడటం లేదా? చిన్న విషయానికింత దూరమెందుకు తెచ్చుకుంటావు..? అన్నాడు.

సమ్మిరెడ్డేం మాట్లాడకుండా తలవంచుకోనున్నాడు. ''సార్లు..మీరంతా వెళ్ళిపోండి. నా సంగతి నేను చూసుకుంటాను. దయచేసి అవసరమైతే మీరు విన్నదే చెప్పండి..'' అన్నాడు పోచయ్య.

''పోచయ్య! మనమంతా రోజూ ఒకరి ముఖాలనొకరం చూసుకునేవాళ్ళం. ఏదో సమ్మిరెడ్డి నోరు జారిండు..దయచేసి పట్టుబట్టకు..సమ్మిరెడ్డి నీకు క్షమాపణ చెబుతాడు..నువ్వూర్కో...'' అన్నాడు ప్రతాపరెడ్డి..

చెప్పులు కుట్టే వ్యక్తికి క్షమాపణలు చెప్పడానికి సంకోచిస్తున్నాడు సమ్మిరెడ్డి.

''సమ్మన్నా! నేను చెప్పినట్టు విను.. ఇలాంటి కేసులు సీరియసవుతాయి. పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పోచయ్యకు అపాలజీ చెప్పు..'' అన్నాడు ప్రతాపరెడ్డి సమ్మిరెడ్డితో..

కొద్ది క్షణాలు తనలో తానే తర్జన భర్జన పడ్డాడు సమ్మిరెడ్డి..తలవంచుకొని పోచయ్య ద్గగరికొచ్చి.

''నా తప్పే..క్షమించు..' అని రోషంతో, అవమానంతో ఎర్రబడ్డ ముఖంతో అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు సమ్మిరెడ్డి..పోచయ్య ముఖంలో విజయహాసాన్ని చూసాడు ప్రతాపరెడ్డి..

కొద్దిసేపట్లో అక్కడున్న వాళ్ళంతా వెళ్ళిపోయారు. షాపులన్నీ మూసేసి లంచ్‌చేయడానికి వెళ్ళిపోయారందరూ..

ఎండ తీవ్రత మరింత ఎక్కువైంది. కోతిని కట్టేసాడు పోచయ్య. చెట్టుకిందున్న నల్లా ద్గగరికెళ్ళి చేతులు కడుక్కున్నాడు.. ఇంటినుండి తెచ్చుకున్న అల్యూమినియం టిఫిన్ డబ్బా తెరిచాడు. కోతి ముందింత అన్నం పడేసాడు. ఆ డబ్బా గిన్నెలో ఉన్న పప్పుతో కలుపుకొని అన్నం తిన్నాడు. మూతి

ఊకున్నాడు... డబ్బాగిన్నెను కడిగి బోర్లించాడు.

ఎండ విపరీతంగా ఉండటంవల్ల రోడ్డు మీదెవరూ కనబడటం లేదు. చేసే పనెంతో ఉన్నా కొంతసేపు విశ్రాంతి తీసుకుందామని టేలాలో నడుం వాల్చాడు పోచయ్య. తలాపుకు తోలు పెట్టుకున్నాడు. దానిమీద పంచెవేసి వెల్లకిలా పడుకున్నాడు. కొద్దిసేపు నిద్రపోదామని ఎంత ప్రయత్నించినా అతనికి నిద్రరావడంలేదు. ఎంత వద్దనుకున్నా ఇందాక జరిగిన సంఘటనే జ్ఞాపకం వస్తుంది.

ఈ మధ్యకాలంలో తెలంగాణా గ్రామాల్లో చాలా మార్పులు రావడం గమనించాడు పోచయ్య అయినా సమ్మిరెడ్డి లాంటి వాళ్ళను చూస్తూనే ఉన్నాడు.

ఏవేవో ఆలోచిస్తున్న పోచయ్య కళ్ళముందు ఆతని యాభై ఏళ్ళ జీవితం తెరలు తెరలుగా కదలుతుంది. తాను పుట్టి పెరిగిన ఊరు, బంధువులు, దొరలు, తల్లిదండ్రులు, అన్న, చెల్లెలు, తన పిల్లలు, భార్య.. ఇంకెన్నో జ్ఞాపకం వచ్చి అతని మనసు గతజీవిత పుటలను తిరిగేస్తుంది. గత జీవితం తాలూకు దృశ్యాలెన్నో అతని కళ్ళముందు కదలాడుతున్నాయి.

★ ★ ★

మట్టిరాలుతూ కూలడానికి సిద్ధంగా ఉన్నగోడలు.. గోడలపై తాటి కమ్మల కప్పు.. గుడిసె పక్కనే ఉప్పునీళ్ళ బావి. బావి దగ్గరున్న జాలర్ల దగ్గర్నుంచి గుప్‌మని వస్తున్న మురుగువాసన.. దగ్గర్లోనే పెంటబొంద.. జాలరి నిండా, పెంట బొంద నిండా దోమలు జుయ్‌జుయ్‌మని ముసురుతున్న ఈగలు.

ఇంట్లో మట్టి కుండలు..వాసనేస్తున్న తోలు..మట్టిగద్దెపై పెట్టిన కూరాడు..కూరాట్లోంచి వస్తున్న పులిసినగంజివాసన పొయ్యి ముందు కాల్లుజావుకొని ఉష్ ఉష్ అంటూ పొయ్యంటుబెట్టడానికి గొట్టంతో ఊదుతుంది రానమ్మ.

గుడిసె ముందు వాకిట్లో ఎద్దుతోలును సరిచేస్తూ చెప్పులు కుట్టడానికి ప్రయత్నిస్తున్నాడు పీరయ్య- అతనికి కొంచెం దూరంలో ఈతనారతో తాడు పేను తున్నాడు పీరయ్య పదేళ్ళ కొడుకు లింగయ్య కుంచుతలెలో పోసిన అంబట్లో ఈగలు ముసురుతుంటే వాటిని పారదోలడానికి ప్రయత్నిస్తూఅంబలి తాగుతుంది పేరయ్య కూతురు నాలుగేళ్ళ లచ్చిమి.. ఊడిపోతున్న చిరిగిన నిక్కర్లను, పంచెలను పైకనుకుంటూ, చీమిడి ముక్కులను మోచేతులలో రాసుకుంటూ నలుగురైదుగురు పిల్ల లాడుకుంటున్నారక్కడ...

వాళ్ళతో ఆడుకుంటున్న ఆరేళ్ళ కొడుకు చెప్పులు కుడుతున్న తండ్రి దగ్గర కొచ్చి నిల్చున్నాడు..అంగీ జేబులో పోస్తున్న నూకలను చేత్తో తీసుకొని నోట్లో పోసుకున్నాడు...

''నాయిన్నా, నాయిన్నా...'' అన్నాడు.

నోట్లో నూకలుండటం వల్ల మాట సరిగా రావడంలేదు..

''బుక్కినంకన్న మాట్లాడు..మాట్లాడినంకన్నబొక్కు..'' కసిరినట్టన్నాడు పీరయ్య. నోట్లోని నూకలను కసాపిసానమిలి మింగాడు పోచయ్య.

''నాయిన్నా..! ఓ నాయిన్నా..! మరోసారి పిలిచాడు పోచయ్య..

పనిచేస్తూనే కొడుకు దిక్కుచూసాడు పేరయ్య.

''ఏంగావాలె..? ఊకె ఆటేనా..? అన్నతాడు పేనుతండు..సాయంజెయ్యిపో''

''మాసేత్తగని ఒక్క మాటినే నాయిన్న..''

ఏందో చెప్పలేవు..?

''నేం బడికి వోత..''

''అప్పటిమాటను చెప్పొక మానను అన్నట్టు ఎప్పటి కదేనాబిడ్డ..సదివించుడు నానుంచి గాదని సెప్పినగద..! బొడ్డ్డాడని పోల్లగానికాన్నుంచి అందరు పని జేస్తెనే ఎల్లుతలేకపాయె..సదివించు డేడైతది..''

''మనూల్లేకే బడచ్చింది గాదె..

''గాబడి రాంగనే ఏమచ్చె..బడంటే ఏమన్న బిల్లింగు గట్టింద్రా..? గాకర్నప్పంతుల్లింట్లనే నడువ వట్టే.. మనకెందుకు బిడ్డ చదువులు..? రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు మనయి''.

''నాయిన్నా..! ఇప్పుడు మనకులపోల్లు గూడ కొంతకొంత మంది బడికి వోతంద్రుగాదె.. గాదొంత సాంబయ్య కొడుకు పోతలేడా..?''

''వాన్ని ఎవ్వలు ముట్టుకోకుంట ఎనుక కూసుండ వెడుతండటసారు.. అయినా ఎల్లినోడు సదువుకుంటడు.. మనకెల్లది.. ఎంత కట్టపడ్డాబట్ట పొట్టకెల్లుడే కట్టమైతంది.. ఇగసదివించుడేడైతది...?

''నేంజగిపి న[illegible]రి జేత్తె మనకు కష్టాలుండవు.. నేను పజ్జేసకుంటనే సదువుకుంటనే నాయిన్న..''

ఎంతో ఆగింగ[illegible]మాట్లాడుతున్న కొడుకుని దగ్గరకు తీసుకున్నాడు పేరయ్య శరీరమంతా ఆప్యాయంగా నిమిరాడు.

''నాకు గీబాంచెపని చెయ్యించాలనేం లేదు బిడ్డ..కని మనకెల్లది గిప్పుడు గిప్పుడే మనోల్లు చదువుకునుడు మొదలువెడుతంద్రు..దొరల కండ్లుమండుతున్నయి.. ఇగగాదొరలతోని కంటపుడెందుకు సెప్పు..? అందరు సదువు కోవన్నంటే ఇంక కొన్నేండ్లు పడుతది.. నీ కొడుకును బాగసదివిచ్చుకుందువుగని నువ్వైతామాటెత్తకు...''

సరేనని తలూపాడు పోచయ్య..

గుడిసెలోంచి బయటకొస్తూ పోచయ్య తల్లి.

''గీ చిన్న పోరన్నన్న చదివిత్తేంబాయె..?'' అంది..

'' ఏంబోదుగని ఎల్లది..నీకె మెరుక..? చదువంటే మాటలనకున్నావా..? మంచిమంచి బట్టలుకొనియ్యాలె..వయిలు గొనియ్యాలె..గవ్వన్ని మనకేన్నుం చత్తయి..? మోసెటోనికెరుక కావడి బరువని నీకమెరుక..?'' అన్నాడు.

''నువ్వేమొకావడి మోత్తంటే నేను కూసుండి తింటన్నగదా..! ఒక్క నాడన్ననేన వర్థిగున్నదున్నదా..? బొక్కలన్ని కలికలిగాంగ ఇంట్లో పనులు, చేను పనులు, దొరలకు ఎనుకంతులకు పోవుడు.. ఇంక నీ పనులల్ల సాయం జేసుడు నేనట వర్థిగుంటె తిండి పెడుతండట..'

'నువ్వు వర్థిగున్నవని నేనన్ననె'..నువ్వేమన్న దొర్సానివా కూసుండి తినుటానికి..మాదు పుట్టుక పుట్టినంక కాలు మీద కాలేసుకోని బతుకన్నంటేడ గలుత్తది..? ఎంత జేసినా దొరల గుణోపెండ్లు తప్పకపాయె..'

''సరే పటు మన నసీబెట్లుంటే గట్లయితది. గడుకుడికింది తింటరా..?

''ఏం కూర జేసినవు..?

'రామునుల్కా యలుంటేనే ఉడుకవెట్టిన.. మనకు రుచిగ పచిగ కూరల్దొరుకుతయా? పులిసిన అంబలి కలుపుగోని గడుక తింటె మస్తురుచుంటది. తంటారా..? కొర్దిగాగుతరా.?

''కడుపుల గలగల మా అంటంది గని గీ పనిగానియ్యి. దొరపాలేరు చెప్పులవ్వి. మనిషిందోలుతడు మల్ల..'' అని తన పనిలో నిమగ్నమయ్యాడు పేరయ్య. పోచయ్య లింగయ్యకు తాడు పేనడంలో సాయంచేస్తున్నాడు.

''నీ యవ్వ! పని పెండ్లాం ముండమొయ్య..? చూడబోతె ఎప్పుడు పని జేసినట్టె.. ఎనుకకు జూసుకుంటే లేదు.'' తనలో తానుకుంటూ పనిచేస్తున్నాడు పేరయ్య.

ఇంతలో దొర చిన్న కొడుకు రాజారావు సైకిల్ తొక్కుకుంటూ వచ్చి సైకిల్ దిగాడు. అతన్ని గాసి లేచి నిల్చున్నాడు పేరయ్య.

''ఇంత దూరమచ్చేవరకు మొసరావట్టె..'' అన్నాడు రాజారావు.

''మా ఇండ్లు ఊరు కడకే ఉంటయిగదా చిన్నదొర..? అన్నాడు పేరయ్య.

పేరయ్య చేతులు కట్టుకుని నిల్చున్నాడు.''మీరెందుకొచ్చిండ్రు చిన్నదొరా..'' అన్నాడు. పదిహేనేళ్ళు కూడా లేని ఆ బాబు ముఖం రక్తమోడినట్టుంది. కోపంగా ఉంది.

''పాలేరోల్లంత పనులకు పెయిండ్రు. సుంకరోడు గూడ కనపడలేదు. తొండమెందుకుకట్టలేదు. లేరోని చెప్పులెందుకియ్యలేదు...? బాపు నిన్ను బాగా తిడుతండు..' అన్నాడు రాజారావు.

'' ఇగో అయిపోతన్నయి దొర. నూనె రాస్తె పనయిపోతది. మీ పనే చేస్తున్ననని పెద్దదొరతోని చెప్పుండ్రి...''

''మీకు బాగా బలుపులచ్చినయి. ఇయ్యాలతేకుంటే చెప్పిరాగొదాక తంతనన్నడు బాపు..'' అని సైకిలెక్కి వెళ్ళిపోయాడు రాజారావు.

అంత చిన్నవాడైన రాజారావు తన తండ్రినలా అనడం పోచయ్యకు బాధాకారంగా ఉంది.

''నాయిన్నా-? దొరకొడుకు వర్తిగనేగట్ల మాట్లాడుతంటె గప్పుడున్న జేత్తలేవ్వేందే..? అన్నాడు పోచయ్య తండ్రి దగ్గరికొచ్చి..

పేరయ్యేం మాట్లాడలేదు..

''నాకైతే తన్నాలనిపించింది..'' మళ్ళీ అన్నాడు పోచయ్య..

''అబ్బో! గాల్లకెదురు మాట్లాడి మనం బతుకుతమా బిడ్డ..! ఆల్లు దొరలు.. ఆల్లదే సాగుతుంది..''

''దొరలంటేందే''?

ఆ పసివాడికేం జెప్పాలో వీరయ్య కర్థం కాలేదు..

కొంచెం సేపు తలపటాయించాడు.

''దొరలంటె బాగ భూమి జాగలున్నోల్లు.. బాగ పైసలున్నోల్లు.. బాగ అధికారాలున్నోల్లు.. పెద్ద కులపోల్లు..''

పూర్తిగా అర్థం కాకున్నా తండ్రి చెప్పేది కొంతర్థమైంది పోచయ్యకు..

''అల్లకు భూములుంటేంది..? పైసలుంటేంది మనకేమన్నితండ్రా..? ఎందుకు గిట్లదిట్టుడు..?''

అన్నాడు పోచయ్య..

"నాకు గవ్వన్నితెలువయి బిడ్డ..మనరాతలు గిట్లున్నాయి.."

రాతంటేందో అర్థం గాకున్నా మౌనంగా ఉన్నాడు పోచయ్య..

తండ్రితో పాటు చెప్పులు కుట్టడం తొండాలు కుట్టడం నేర్చుకున్నాడు. తాళ్ళు, పగ్గాలు. తలుగులు తయారు చేయడం నేర్చుకున్నాడు.. తండ్రి చెప్పిన వాళ్ళిండ్లలో ఇచ్చి వస్తున్నాడు.. తండ్రికి, అన్నకు అన్నివిధాలా సాయపడుతూ పనులు నేర్చుకున్నాడు..

తండ్రితోపాటు డప్పు చాటింప్రుకూ పోయేవాడు..తండ్రి ఊరంతా తిరుగుతూ నోరు నొప్పి పెట్టేలా అరుస్తూడప్పు చాటింపు చేస్తే ఇచ్చేది అతి స్వల్పమే.. ఊరివాళ్ళు ముఖ్యంగా దొరల కుటుంబాల వాళ్లెప్పుడూ తమను గౌరవంగా పిలిచింది చూడలేదు పోచయ్య. ఏపనికి ఏ కొంచెం ఆలస్యమైనా కొన్నిసార్లు ఏ కారణం లేకుండానూ దొరలు తమను బండబూతులు తిట్టడం చూసాడు పోచయ్య..తాము వాకిట్లోకెళ్లితే నీళ్ళు చల్లడం చూసాడు..తామిచ్చిన వస్తువులను నీళ్ళు చల్లి తప్ప తీసుకునే వారు కారు.. ఇన్ని అవమానాలనెదుర్కుంటూ కూడా కడుపునిండా తిండికైనా లేని పరిస్థితుల్లో తమెందుకుండాలో పోచయ్య కర్థమయ్యేదికాదు..

చెప్పులూ, తాళ్ళు తేవడంలో ఆలస్యం జరిగిందని పేరయ్య, లింగయ్య దొరలతో చెప్పుదెబ్బలు తినడం చూసాడు పోచయ్య..దొర చేల్లో వెట్టి దానిలా పనిచేసే అతని తల్లి కందికాయలు తెంపుకుందన్న నెపంతో ఘోరాతి ఘోరంగా అవమానింపబడటమూ చూసాడు..

పోచయ్య కిప్పుడిప్పుడే సమాజాన్ని గూర్చి అర్థం చేసుకునే జ్ఞానం, వయసూ వస్తున్నాయి.. అతనిలో తండ్రి లాగా, అన్నలాగా ఏదంటే అదిపడే స్వభావం రావడం లేదు.. ఒకటి రెండు సార్లు ఎదురు మాట్లాడి దొర పిల్లలతో దెబ్బలు తిన్నాడు.

పోచయ్య కిప్పుడు పద్నాలుగేళ్ళ వయసు... ఆ సమయంలో జరిగిన సంఘటన పోచయ్య మనోఫలకంపై గాఢమైన నముద్ర వేసింది..

రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం పడుతుంది. ముసురసలే వదలడం లేదు..అసలే మురికివాడలైన హరిజనవాడ కడుగు పెట్టడం కష్టంగా ఉంది.. పెంట బొందల్నుండి గబ్బువాసన, జాలర్ల నుండి దోమలు, ఈగల స్వైర విహారం.. ఇంట్లో ఉన్న గడుకో, నూకలో ఉడకమెట్టుకుంటానికి పొయ్యింటుబెట్టడానికి పొడి కట్టెల్లేవు..చీమిడి ముక్కుల్తో అపరిశుభ్రంగా ఉన్నపిల్లలు..కొందరు నెత్తురు బంక బైలుతో బాధపడుతున్నారు..కలరా వస్తుందేమోనని భయపడ్తున్నారు.

ముసురు పడుతూనే ఉంది.. తలలమీద గొంగళ్లేసుకుని చేతుల్లోబరిసెలతో ఇద్దరు సుంకర్లొచ్చారు హరిజనవాడకు.. ఇంటింటికి తిరుగుతూ భయపెడ్తున్నారు.. బూతులు తిడ్తున్నారు..

"దొర కొట్టంలో బర్రె చనిపోయుంది..దొర పట్టరాని కోపం మీదున్నడు..నడువుండ్రి.." అని గోల చేస్తున్నారు..

ఏడెనిమిది మంది హరిజనులు గొంగళ్ళు ముసుగులేసుకుని సుంకర్లతోపాటు దొర ఇంటికెళ్లారు..తండ్రితో పాటు పోచయ్యా పోయాడు..చేతులు గట్టుకొని వాకిట్లో నిల్చున్నారు..

"-----పండ్లొచ్చినాయిరలమ్మిడికొడుకుల్లారా..! మొన్ననంగ సచ్చింది బర్రె.. ఎన్రోజులుంటదిరా కొట్టంలో.." అన్నాడు కోపంగా..

''తీసుకపోతం దొరా..! రొంద్రోజుల్నుంచి మన్నుమిన్ను ఏకమైనట్టు వానొగొడ్తున్నది మీరు సూత్తనే ఉన్నరు గద..!' 'అంటున్న చిలుకయ్యమీదుకి చెప్పిసిరేసిండు దొర..

''దొంగనాకొడుకుల్లార..! వానయితె బువ్వ దింటల్లేర్ర.. ఏపనన్న ఆగుతుంద తుప్పర తుప్పర ముసురున్నప్పుడు కొంచవోరాద..మీకు బాగమత్తచ్చింది..చచ్చిన బర్రె ఎన్రోజులుంటది కొట్టంలో..''

''గీ వానల..'' అనబోయిన పేరయ్య మీది కింకో చెప్పువిసిరాడు..

''గంతేగిర్తముంటె నీ పాలేర్లతోని తీపించుకోపెయినవు..?''

పోచయ్యన్న మాటలతో అగ్గిమీద గుగ్గిలమై లేచాడు దొర..వారుగట్టె చేతిలో పట్టుకొని అరుగు దిగాడు.. ఎవరాపినా ఆగకుండా పోచయ్యను వారుగట్టెతో ఐదారు దెబ్బలేసాడు..పోచయ్య మొత్తుకుంటున్నాడు..

''పడుచోన్నయితన్ననని ఎగుర్తన్నవా..? నీ ఇంట్లనే చంపి నీపెంట బొందల్నే బొందపెట్టిత్తగాడిద కొడుక..'' అని.

''మీరు సత్తరో బతుకుతరో నాకు తెలువది.. ఇప్పుడే దాన్ని తీసుకపోండ్రి.. వాసనకు బతికున్న పశువులు సత్తయి..'' అని వాళ్ళేం మాట్లాడటాని కవకాశమివ్వకుండా లోపలికెళ్ళాడు దొర...

పోచయ్య హృదయం భగభగా మండుతుంది.

వాళ్ళంతా దొర పశువుల కొఠం దిక్కు నడుస్తున్నారు..తొవ్వలన్నీ కయ్యలు గొట్టున్నాయి..అక్కడక్కడ భూమికి పుండై ఉంది..

''నాయిన్నా! దొర బర్రె ఈవానల మనమెందుకు తియ్యాలె..? వాళ్ళెందుకు తీసుకోరు..? మల్లగింత జబర్దస్తెందుకు..?' అన్నాడు తండ్రితో నడుస్తూనే పోచయ్య..

' ఇవ్వి నీకిప్పుడు ఎట్ల జెప్పినా అర్దంకావు బిడ్డ..మనం మాదిగోల్లం ఇసోంటి పనులు మనమే చెయ్యాలె.. ఊళ్ళె ఎవ్వలు చచ్చిపోయినా పాడెమనమే కట్టాలె..? కాష్టం మనమే పేర్వాలె..బొంద పెట్టేదుంటె మనమే బొంద దవ్వాలె..? వాళ్ళిన్ని కల్లునీల్లు పోస్తె తాగాలె..రూపాయోరొండో ఇస్తె తీసుకోవాలె..లేకుంటే లేదు..మనం శవాలను ముట్టుకుంటేం లేదుగాని మనుషులను మాత్రం ముట్టుకోవద్దు..మనమే ఎందుకు చెయ్యాలంటే ఎనుకట్నుంచి గిట్లనే నడుత్తుంది..''

తండ్రిమాటలర్థమయీఅర్థంకానట్టున్నాయి పోచయ్యకు..

బర్రెశవం గుట్టలా పడుంది కొట్టంలో..మెదలే భారీ శరీరం..దానికితోడు రెండు రోజులుగా వానీ, వానకు తడిచి మరింత ఉబ్బిభయంకరంగా ఉంది.కొంత భాగం కుళ్ళినట్టుంది.. ఆ శరీరంలోంచి వస్తున్న వాసన భరించరానిదిగా ఉంది.

తలకున్న రుమాల్ల కొంగులను ముక్కుకడ్డంగా పెట్టుకున్నారువాళ్ళంతా..కక్కుకోబోయి నిగ్రహించుకున్నాడు పోచయ్య..

వాళ్ళంతా కలిసి కదిలిచ్చినా కదలడం లేదా శవం..వెనుక రెండు కాళ్ళు కలిపి, ముందు రెండు కాళ్ళు కలిపి తాళ్ళతో కట్టారు..కడుపుకింది నుంచి తాడు బిగించారు..తాళ్ళ మధ్య నాలుగు కట్టెలు చేర్చారు..అటు నలుగురు, ఇటు నలుగురు అతి బలవంతంగా లేపుతే అతి కష్టంగా ఇంచుమందం భూమ్మీది నుంచి పైకి లేస్తుంది..అక్కడున్న ఇంకిద్దరూ చేయేసారు..పదిమంది కలిసి అతికష్టంగా ఈడిగిలబడుతూ

ఆ శవాన్ని ఊరిబయటకు మోసుకెళ్తున్నారు.. భరించరాని బరువొక దిక్కైతే బురదగా జారుడుగా ఉన్న నేలపై నడవడం మరింత భారమవుతుంది.. ఆ శవాన్ని చేర్చాల్సిన చోటికి చేర్చేసరికా పదిమందీ అలిసిపోయారు.. వాసన భరించలేక నలుగురైదుగురు వాంతి చేసుకున్నారు..

దాన్ని కోస్తున్న దృశ్యాన్ని, అటు తర్వాత దాన్ని రాబందులు పీక్కుతినటాన్ని చూసిన పోచయ్య మూడు రోజుల వరకూ మనిషి కాలేదు..

పోచయ్య బాల్యమంతా ఘోరంగానే గడిచిపోయింది.. పని చేయడం పోచయ్యెప్పుడు భారంగా భావించకున్నా తమవెట్టి బతుకులు, తమపై జరుగుతున్న దౌర్జన్యాలు అతనికి బాధాకరంగా ఉన్నాయి.

పోచయ్య ఇప్పుడు నూనూగు మీసాలనూత్న యవ్వనంలోకి ప్రవేశిస్తున్నాడు.. మూతిమీద మీసాలు మొలుస్తున్నాయి.. లోకం గూర్చిన అవగాహన, ఎన్నిటినో ఎదిరించాలన్న ఆవేశమాతనిలో చోటు చేసుకుంటున్నాయి..

లింగయ్య పెళ్ళిచేసుకొని వేరుపడి బతుకుతున్నాడు.

తండ్రితో కలిసి తల్లి, చెల్లితో ఉంటున్నాడు పోచయ్య..చెల్లి పెళ్ళి చేసిం తర్వాతనే పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు.

తండ్రి అకాల మరణం ఆతన్ని బాగా కుంగదీసింది. మెల్లమెల్లగా ఆ షాక్ నుంచి తేరుకొని చెల్లె పెళ్ళి చేద్దామనుకుంటున్న తరుణంలో మరో ఘోరమైన సంఘటన జరిగింది. భీంరావుదొర కొడుకు రాజారావు పోచయ్య చెల్లెలును బలవంతంగా అనుభవించాడు. చెల్లంటే ఎంతో ప్రేమున్న పోచయ్య రాజారావును నరుకుతానని కళ్ళెర్ర జేసాడు.

కులపెద్దలాతన్ని శాంతింపజేయడానికి ప్రయత్నించారు. ''కడుపుచించుకుంటే కాళ్ళమీద పడుతుందన్నట్టు మన విషయం మనమే బయట పెట్టుకోవడం మంచిదిగాదు. మన కుటుంబాల్లో అందగ కనపడ్డ ఏ స్త్రీగూడ దొరల కామానికి బలిగాక తప్పలేదు. ఇది నిజం. నువ్వీ విషయం బయటపెట్టకుండా చప్పుడు జేకుండు.'' అన్నాడు కులపెద్ద.

పోచయ్య యువరక్తం సలసలకాగుతుంది. మనసు కుతకుత ఉడుకుతుంది. ఆ విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నాడు.

''మనం కూటికి పేదలంగావచ్చు. కాని కులానికి, శీలానికి గాదు. ఇంత అన్యాయం జరుగుతె మనమెందుకు కూర్చుండాలె' అన్నాడు పోచయ్య..

''పేదవాని కోపం పెదవులకు చేటంటరు. మనమిప్పుడు పంచాయితి పెడితె మనపిల్ల సంగతి మనమే బయట పెట్టుకున్నట్టయితది. అడివిపనికెళ్ళిన మన ఆడోల్లపై ఇసొంటియెన్నోసార్లు జరిగినయి. అయినా పట్టించుకున్న వాళ్ళెవ్వరు లేరు.''

కులపెద్ద ఎంత చెప్పినా పోచయ్య వినదలుచుకోలేదు. తనకొడుకుమీదనే పంచాయితీ అని భీంరావు ఆగ్రహం వెళ్ళగక్కాడు.

పంచాయితీలో చర్చోపచర్చలు జరిగాయి..

అప్పటికింకా ఊళ్ళో ఏ పోరాటాలు ప్రారంభంకాలేదు. రజాకారు వ్యతిరేక పోరాటానుభవాలు కొంతమంది వృద్ధులకు తెలిసినా దొరలకెదురు ఎవరూ మాట్లాడే పరిస్థితులు లేవు. కొంతమంది విద్యావంతులవుతున్న యువకులు అప్పుడప్పుడే యువజన సంఘాల నేర్పాటు చేస్తున్నారు.

అయితే ఇంకా దొరలనెదిరించే సాహసం ఎవరికీ రాలేదు.

''మీ చెల్లెమో పత్తిత్తని మాట్లాడవడ్తివి. మీ ఆడోల్లెంత పతివ్రతలో మాకు తెలువదా? అయినా నా కొడుకే దాన్ని బలవంతం చేసిండని నమ్మకమేంది..? అదే ప్రోత్సహించలేదనెట్లు చెప్తుతవు..? దొరల దగ్గర పైసలు గుంజుదామని ఎంతమందిట్లజేత్తలేరు..'' అన్నాడు భీంరావు.

భీంరావు మీదికురకబోయిన పోచయ్యను కులపెద్ద లాపారు.

పోచయ్య కుటుంబానికి రెండు వందల రూపాయలివ్వాలని తీర్పిచ్చారు.

ఆ అవమానాన్ని భరించలేక పోచయ్య చెల్లెలు బావిలోపడి ఆత్మహత్య చేసుకుంది.

ఇక ఆ ఊళ్ళో ఉండటం సాధ్యంకాదనుకున్నాడు పోచయ్య. చెల్లెలు చావుకు కారణమైన వాళ్ళపై ఆగ్రహాన్ని నిగ్రహించుకోలేకపోతున్నాడు. ఎంత తనకు తాను సరిపెట్టుకుందామనుకున్నా ఆ ఊళ్ళో ఉండటం సాధ్యం కాదని తల్లిని తీసుకొని ఊరొదిలాడు పోచయ్య. కొద్ది రోజుల్లో తల్లికూడ ఈలోకాన్ని విడిచి వెళ్ళిపోయింది.

ఐదారేళ్ళు ఎక్కడెక్కడో తిరిగాడు. ఈ మధ్యకాలంలోనే పెళ్ళి చేసుకున్నాడు. చివరకు ఓ మిత్రుడి సాయంతో, సలహాలతో కొత్తగా ఏర్పడిన పారిశ్రామిక కాలనీలో ఓ టేలా పెట్టుకొని చెప్పుల రిపేర్ దుకాణం తెరిచాడు.

పోచయ్య ఊరొదిలిన ఒకటిరెండు సంవత్సరాలలోనే తెలంగాణా గ్రామాల్లో పోరాటాలు ప్రారంభమయ్యాయి. క్రమక్రమంగా అవి ఉధృతరూపం దాల్చాయి. మరోదిక్కు అంబేద్కర్ సంఘాల్లూ తమ పనిని కానిస్తున్నాయి. పోచయ్యకు ఉద్యమాలపట్ల సానుభూతుంది. అయితే అంబేద్కర్ సంఘాలతోనే తన సంబంధాలను పెంచుకున్నాడు. దళిత సంస్కృతియొక్క గొప్పదనాన్ని గూర్చి తెలుసుకున్నాడు. దళితులకు పోచయ్య, మైసమ్మలలాంటి క్షుద్రదేవతారాధనుండటం, సంపన్నకులాల వారికి వాటిపట్ల అంతగా ఆదరణ లేకపోవడం గ్రహించాడు.

చదువుకు దూరమైన తాను తన కొడుకును ఎంత కష్టపడైనా సరే చదివించాలని బడికి తోలుతున్నాడు.

పోరాటాలవల్ల గ్రామాల్లో ఒకప్పుడు పీడితులుగా ఉన్న దళితులదే పైచేయిగా ఉండటం చూస్తున్నాడు పోచయ్య.

గ్రామాల్లో వస్తున్న మార్పులతో చాలా వరకు సంతృప్తి చెందాడు. పోచయ్య కొడుకు చదువుకొని ప్రభుత్వోద్యోగి అయ్యాడు.

★★★

'' ఏం జేస్తున్నావు? కలగంటున్నవా?'' అన్న రాజనర్సు మాటలతో ఈలోకంలోకొచ్చాడు పోచయ్య.

లేచి కూర్చున్నాడు.

రాజనర్సు పోచయ్యకు ప్రాణస్నేహితుడు. పోచయ్య చెప్పుల టేలా పక్కనే చెరుకురసం అమ్ముకుంటూ బతుకుతున్నాడు. వాళ్ళిద్దరూ ఒకరి కష్టసుఖాలొకరితో దాపరికం లేకుండా మాట్లాడుకుంటారు.

''కలసోంటిదే. కాని నిజం. నా పాతజీవితమంత యాదికచ్చింది. నిజంగ.. ఇరవదేండ్ల కిందకున్న

ఇప్పటికి తెలంగాణ ఊళ్ళళ్ళ ఎన్ని మార్పులచ్చినయి..' అన్నాడు పోచయ్య.

''అవును మరి..! మునుపు దొర వాకిట్ల నిల్సొని మాట్లాడుటకూడ ఎక్కువే, ఇప్పుడు కొన్ని ఊళ్ళళ్ళ దొర అనిపించుకుంటానికి భయపడుతండ్రు..''

''గా మాటలు నిజమే కని ఇంకా కొన్నూళ్లల్ల ఏదో రూపంల అంటరానితన ముందనిపిస్తుంది. ఇప్పటికీ జగిత్యాల దగ్గరున్న కొన్ని పల్లెల్లచాకలోల్లు దళితుల బట్టలు తడిపేస్తెనే ఉతుకుతురట. దీన్ని గురించి లొల్లులు గూడయినయి..''

''కావచ్చు. కాని మనోల్లిప్పుడు చాలా మందే చదువుకుంటండ్రు. గిది మంచిదే. కాని ఉద్యోగమైనంకతల్లిదండ్రులను, తనోల్లను గూడ పట్టించు కుంటలేరు. నేనందరు గట్లనే ఉంట రంట లేను. కొంత మంది కొందరైతే కొత్తదొరలోలెమెదుల్తుండ్రు. వాళ్ళిండ్లల్ల పని మనుషులను పెట్టుకుంటండ్రు. గిది తప్పంగాదు. వాళ్ళను మునుపు మనల్ని దొరలెట్ల జూత్తురో గట్ల జూత్తండ్రు. అన్ని మరిచి పోయిండ్రు.''

రాజనర్సు మాటలు విన్న పోచయ్యకు కొడుకు జ్ఞాపకం వచ్చాడు. ఎన్నో ఆశలు పెట్టుకొని కొడుకును చదివిస్తే ఆతడు ఆకాశంలోంచి ఊడిపడ్డట్టుగా ప్రవర్తిస్తుండటం జ్ఞాపకం వచ్చి హృదయం బాధతో మూల్గింది.

''అవును... చాలామంది గతాన్ని మరచిపోయి బతుకుతున్నారు. తనవాళ్ళు చదువుకొని తెలివికొచ్చిన వాళ్ళ నుంచి ఎంతో కొంత ఆశిస్తరన్న ఇషయంమరిచిపోతండ్రు. పైసలు సంగతి పోని. వెనుకబడున్న తన వాళ్ళకేదో విధంగ సాయంజేద్దామన్నమాటే లేదు. కొందరైతే అంబేద్కర్‌ను గూడ పట్టించుకుంటలేరు...'' అన్నాడు పోచయ్య.

''అవున్లే... అయినా రకరకాల మనుషులంటరు. తన చదువు, జ్ఞానం తన వాళ్ళకుపయోగపడ్డప్పుడు, ఏదోవిధంగ సమాజానికక్కెర కచ్చినప్పుడు దానికి విలువుంటుంది. అప్పుడే అది సార్థకమైతది.''

ఇద్దరూ తమపనుల్లో నిమగ్నమాయ్యరు.

ఓ దిక్కు జీవన్మరణ పోరాటాలు చేస్తున్నయువతరం. ఎంతో బాధ్యతా యుతంగా ప్రవర్తిస్తున్న యువతరం. మిడిమిడి జ్ఞానంతో తనచుట్టు తానే గిరిగీసుకున్ని బతుకుతున్న యువతరం, లంపెన్ యువతరం. వివిధ రకాల యువతరం గూర్చి ఆలోచిస్తూ సాయంత్రం ఏడున్నర గంటల వరకు పనిచేశాడు పోచయ్య.

అన్నీ సర్ది టేలా మూసి ఇంటి దిక్కెల్తున్నాడు. ఓ చేతిలో కోతిని కట్టిన గొలుసుంది.

గేటవతలున్న పెంకుటిల్లు దిక్కునడుస్తున్నాడు పోచయ్య. చాకలి వాళ్ళు కోసి పారేసిన కోడికాళ్ళు పీకిపారేసిన కోళ్ళ వెంట్రుకలు,గొర్రె బొక్కలు... వాసనతో గెదడుగెదడుగా ఉంది.

పొద్దున జరిగిన సంఘటనను, తన జీవితాన్ని, వస్తున్న మార్పులను మననం చేసుకుంటూ ఇల్లు చేరుకున్నాడు పోచయ్య.

అంటు కుంటున్న బొగ్గు పొయిల్నుంచి వచ్చే పొగ దట్టంగా అలుముకుంది.

భార్య నీళ్ళు కాగబెట్టుంచింది. స్నానం ముగించి మంచంలో వెల్లకిలా పడుకున్నాడు పోచయ్య.

''తెలంగాణ మొదట్నుంచీ పోరాట భూమే. నీ బాంచెన్ కాల్మొక్త అని బతికిన వాళ్ళే.. రజాకార్ల కెదురునిలిచి పోరాడారు. భూమి పంచుకున్నారు. అటుతర్వాత కొంతకాలం మళ్ళీ దొరలకాలమే నడిచింది.

అణిగిమణిగి బతికారు. ఆ అణగిమణిగి ఉన్న జనమే మళ్ళీ విజృంభించి వీరోచిత పోరాటాలు చేస్తున్నారు. భూపోరాటాలతో పాటు సాంస్కృతిక పోరాటాలూ, కుల పోరాటాలూ జరుగుతున్నాయి. ఒకప్పుడు తెలంగాణాలో హరిజనుల పరిస్థితి కోస్తా ప్రాంత హరిజనుల కంటెచాలా అధ్వాన్నంగా ఉండేది. ఇప్పుడనేక కారణాలవల్ల వాళ్ళకంటె ముందున్నారు. తమ మీద జరుగుతున్న దౌర్జన్యాలను సహించే స్థితిలో లేరు. ఇప్పుడు పదిరికుప్పం, కారంచేడులాంటి సంఘటనలు తెలంగాణాలో జరిగే అవకాశాలు లేవు''.

ఓ మీటింగులో కార్మిక నాయకుడన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి పోచయ్యకు.

ఆతని ఛాతీ గర్వంతో ఉప్పొంగి రెండింతలైంది. '' నా తెలంగాణ... నా తెలంగాణ... తనలో తాననేక మార్లను కున్నాడు పోచయ్య.

*ఆహ్వానం మాసపత్రిక ఏప్రిల్ 1997*